అతిథి గృహం.. పనులు ప్రారంభం

- రూ. 8 కోట్ల నిధులు మంజూరు
- మూడు అంతస్తుల్లో భవన నిర్మాణం
- మరో ఏడాదికల్లా అందుబాటులోకి



ప్రారంభమైన అతిథి గృహ నిర్మాణ పనులు

కోదాడ : పట్టణంలో అతిథి గృహం కొరత తీరనుంది. రూ. 8 కోట్లతో అతిథి గృహం నిర్మిస్తున్నారు. భవన నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న కోదాడ పట్టణానికి కొత్తగా ఎవరైన ప్రభుత్వ అతిథులు వస్తే సేద తీరడానికి అతిథి గృహం లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే రామాలయం సమీపంలో యాభై సంవత్సరాల క్రితం నిర్మించిన చిన్న గెస్ట్ హౌస్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో పాటు కొత్త జిల్లాలు ఏర్పడిన తరువాత దానిలోనే ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో అతిథి గృహం లేకుండా పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యుద్ధప్రాతిపదికన అతిథి గృహ నిర్మాణం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గత సంవత్సరం అతిథి గృహ భవన నిర్మాణానికి డిసెంబర్ 2న శంకుస్థాపన చేశారు.

రు.8 కోట్లతో నిర్మాణ పనులు..

పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్అండ్‌బీ పాత గెస్ట్ హజ్ స్థలంలో రూ.8 కోట్ల అంచనా వ్యయంతో నూతన అతిథి గృహాన్ని ఆర్అండ్‌బీ శాఖ అధ్వర్యంలో నిర్మిస్తున్నారు. పది రోజుల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పాత భవనాన్ని పూర్తిగా తొలగించి దాని స్థానంలో మూడు అంతస్తులలో ఈ అతిథి గృహాన్ని విశాలంగా నిర్మిస్తున్నారు. అతిథి గృహంతో పాటు ఇక్కడే ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారుల కార్యాలయాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. పట్టణ నడిబొడ్డున అతిథి గృహం నిర్మిస్తున్నందున ముందువైపు జాతీయ రహదారి ఉండడంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోదాడ ఎమ్మెల్యే సూచనలతో అధికారులు రహదారి వైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు. దీని వల్ల ఆదాయం కూడా రావడంతో పాటు అతిథి గృహం ముందు అస్తవ్యస్తంగా ఉండకుండా, ఇతరులు దుకాణాలు ఏర్పాటు చేయకుండా నివారించనున్నారు.

కోదాడ అభివృద్ధే లక్ష్యం

> కోదాడలో అతిథిగృహం లే కపోవడంతో ఎదరవుతున్న ఇబ్బందిని గుర్తించి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాయంతో నూతన అతిథి గృహాన్ని మంజూరు చేయించా. ఆధునిక హంగులతో భవనాన్ని నిర్మిస్తున్నాం. సంవత్సరం కాలంలో అందుబాటులోకి తీసుకొస్తాం. కోదాడ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం.
>
> – నలమాద పద్మావతిరెడ్డి, ఎమ్మెల్యే, కోదాడ

సర్వాయి పాపన్న ఆశయాలు సాధిద్దాం



పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శంకర్‌గౌడ్, గౌడ నాయకులు

కోదాడరూరల్ : బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను సాధిద్దామని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ డైరెక్టర్ మారగాని శంకర్‌గౌడ్ అన్నారు. కోదాడ మండలంలోని ఎర్రవరంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మొగలుల పాలనకు వ్యతిరేకంగా, అక్రమ శిస్తు వసూళ్లను అరికట్టాలని గెరిల్లా సైన్యంతో మొగల్ చక్రవర్తుల మీద దాడి చేసి గోల్కొండ కోటను ఆక్రమించి పాలించిన గొప్పవీరుడు సర్వాయి పాపన్నగౌడ్ అని ఆయన గుర్తు చేశారు. గౌడ కులస్తులందరూ ఐక్యంగా ఉంటూ ప్రతి గ్రామంలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు బెల్లంకొండ నాగేశ్వరరావుగౌడ్, మాజీ సర్పంచ్ బూర శ్రీనివాసరావుగౌడ్, బెల్లం కొండ ఉపేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆర్థికాభివృద్ధిలో భారత్ నాల్గొవ స్థానం

మిర్యాలగూడ టౌన్ : ప్రధాని నరేంద్రమోదీ దేశంలో ప్రజలకు సుస్థిర పాలన అందించడంతో పాటు ఆర్థికాభివృద్ధిలో దేశం నాల్గొవ స్థానంలో నిలిపారని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు, వన్‌టౌన్ బీజేపీ ప్రభారీ కొండేటి సరిత అన్నారు. భారత ప్రధానిగా అధికారం చేపట్టి 11సంవత్సరాలు అవుతున్న సందర్భంగా శనివారం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేసి మొక్కలు నాటారు. వన్‌టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు బంటు గిరి, కొంగరి వెంకటరమణ, చిల్లంచర్ల అభి, యాదగిరి, సోములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంఠమహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న గౌడ కులస్తులు

చిలుకూరు : పాత చిలుకూరులో గీత పారిశ్రామిక సంఘం, గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీకంఠమహేశ్వర సురమాంబదేవి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రెండో రోజు శనివారం ఆలయంలో గౌడ కులస్తులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన, స్వామివారి కల్యాణం, అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గౌడపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మునగాల ఎంఈఓ వెంకటేశ్వర్లుకు సన్మానం



ఎంఈఓ వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ఎస్ఈఆర్టీ అధికారులు

మునగాల : మునగాల మండల వ్యాప్తంగా 2024– 25 విద్యా సంవత్సరంలో అత్యధిక పాఠశాలలను పర్యవేక్షించిన (సందర్శన) మండల విద్యాధికారిగా స్థానిక మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు నిలిచారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లును ఎస్ఈఆర్టీ డైరెక్టర్ రమేష్, ఆర్‌జేడీ విజయలక్ష్మి శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా 147 పాఠశాలలను మానిటరింగ్ చేసినట్లు తెలిపారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషిచేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ ప్రవీణ్ కుమార్, డీవైఎఫ్ఐ నాయకులు

మునగాల : మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మునగాల ఎస్ఐ ప్రవీణ్ కోరారు. మాదకద్రవ్యాలు, గంజాయి నిర్మూలించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు కోరి సురేందర్, కార్యదర్శి గడ్డం వినోద్, నవీన్, సాయి, రాకేష్, శ్యామ్, బచ్చలకూరి కిరణ్, బచ్చలకూరి మనోజ్, ప్రశాంత్, మొలుగూరి శ్రీను, కొలికపంగు నవదీప్ పాల్గొన్నారు.

బూరుగడ్డ వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు మృతి

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి ఆలయ అర్చకుడు, హుజూర్‌నగర్‌కు చెందిన ముడుంబ శ్రీనివాసచార్యులు శుక్రవారం మృతి చెందారు. శనివారం హుజూర్‌నగర్‌లో శ్రీనివాసచార్యులు మృతదేహాన్ని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ సందర్శించి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాసచార్యులు మృతి తీరని లోటని అన్నారు. అదేవిధంగా పట్టణానికి చెందిన సీనియర్ కళాకారులు దొంతగాని సత్యనారాయణ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో నాయకులు కొండనాయక్, గంజి శివ, బచ్చలకురి బాబు, మనోహరాచార్యులు, పూర్ణ, సుబ్బారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికురాలికి నాయకుల నివాళి

మఠంపల్లి : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు మంగళపల్లి వరమ్మ(50) శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కిషోర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రస్‌మియా తదితరులు వరమ్మ మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. నివాళులర్పించిన వారిలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు దేవదానం, మైసయ్య, ఎస్‌కే సైదాబి, సంతోషం పాల్గొన్నారు.

గ్రూప్–3 ఉద్యోగానికి ఎంపిక

అర్వపల్లి : పర్సాయపల్లి గ్రామానికి చెందిన బానోతు బాలునాయక్–మల్లెపువ్వుల రెండో కుమారుడు బానోతు హుస్సేన్ గ్రూప్–3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ఎస్టీ కేటగిరిలో 90వ ర్యాంక్ సాధించారు. ఆడిట్, ఫైనాన్స్, ట్రెజరీ డిపార్ట్‌మెంట్లలో ఏదైన ఒకదానిలో చేరనున్నట్లు హుస్సేన్ శనివారం తెలిపారు.

'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ బడులు



హుజూర్‌నగర్‌రూరల్ : కరక్కాయలగూడెంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం నేరేడుచర్లలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, అన్నపూర్ణ, భానుమతి, నాగమణి, వీరబాబు, సైదులు, జానకిరాములు, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, బాలు తదితరులు ఉన్నారు.

సర్కారు బడుల్లో సకల సదుపాయాలు

హుజూర్‌నగర్‌రూరల్ : సర్కారు బడుల్లో విద్యార్థులకు ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తోందని ఇన్‌చార్జ్ హెచ్ఎం బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కరక్కాయలగూడెంలో ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, నాగమోహన్‌రావు, వెంకన్న, అంజయ్య, వీరయ్య, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీకి పెరిగిన ప్రజాదరణ



బీజేపీ నూతన మండల కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ప్రభారి కృష్ణయ్య

మఠంపల్లి : దేశంలో ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి గ్రామాల్లో బీజేపీకి ప్రజాదరణ విశేషంగా పెరిగిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మండల ప్రభారి బొలిశెట్టి కృష్ణయ్య అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి ఆదేశాల మేరకు శనివారం మఠంపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటశివయాదవ్ ఆధ్వర్యంలో మండల కమిటీ, యువ మోర్చా నూతన కమిటీ సభ్యులను ఆయన నియమించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు పార్టీ కండువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సైదానాయక్, నరసింహారెడ్డి, స్వామినాయక్, నాగునాయక్, బాలునాయక్, హుస్సేన్‌గౌడ్, అమరయ్య, జనార్దన్, సాంబశివరావు, కవిత, తులసీనాయక్, అనిత, లక్ష్మి, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు శివాజీనాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సైదులు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆదినారాయణ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమణి, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఎస్‌డీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



పూజలు చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం పరిధిలో త్రివేణి నగర్ వద్ద శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి వార్షిక కల్యాణాన్ని శనివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు.. వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, అన్నమయ్య భజన బృందం కమిటీ సభ్యులు ఆకుల రాము, కొండయ్య, మాజీ ఎంపీపీ కె.లక్ష్మీవెంకటనారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు బచ్చలకూరి బాబు, కిషోర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, గురువయ్య, సక్రు నాయక్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

నేరేడుచర్ల : నేరేడుచర్లను చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 6, 10 వార్డుల్లో తడి, పొడి చెత్త, ఎరువుల తయారీపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని, మున్సిపల్ శాఖ సూచించిన స్థలంలో, ఇంటి వద్దకు వచ్చే చెత్త వాహనాల్లో మాత్రమే వేయాలని కోరారు. ట్యాంకులలో నీటిని క్లోరిన్ టెస్టులు చేసి పరిశీలించారు. అదే విధంగా వార్డుల్లోని మురుగు కాలువల్లో పూడిక తీతపై సంఘాల మహిళలతో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి, రిటైర్డ్ ఉద్యోగి పూర్ణచంద్రారెడ్డి, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, సమభావన సంఘాల మహిళలు తదితరులు ఉన్నారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలు అన్యాయం



క్యూబా సంఘీభావ నిధికి నగదును జిల్లా కార్యదర్శికి అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

హుజూర్‌నగర్ : క్యూబాపై అమెరికా ఆంక్షలు విధించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. శనివారం హుజూనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా ఆంక్షలు క్యూబా ఆర్థిక వ్యవస్థను, ప్రజల జీవితాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని అన్నారు. అగ్రరాజ్యం విధించిన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలు వల్ల క్యూబా దేశం 65 ఏళ్ల నుంచి నలిగి పోతుందని చెప్పారు. అనంతరం డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో క్యూబా సంఘీభావ నిధి కోసం వసూలు చేసిన మొత్తాన్ని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, కె.యాదగిరిరావు, ఎం.సైదులు, పల్లె వెంకట్‌రెడ్డి, డి.బ్రహ్మం, వి.సైదులు, పి.హుస్సేన్, శీలం శ్రీను, వీరమల్లు, డీవైఎఫ్ఐ నాయకులు ఎం.వీరబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ముకుందాపురం ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన మేడ్చల్ జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి జన్మదినం సందర్భంగా ముకుందాపురం గ్రామ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఆర్.అప్పిరెడ్డి, బి.సైదిరెడ్డి, బి.శ్రీదేవిరెడ్డి, పి.బ్రహ్మారెడ్డి, వై.విక్రమ్‌రెడ్డి, ఆశ్రమ వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



కోదాడరూరల్ : కోదాడలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



హుజూర్‌నగర్: మతపెద్దకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు



చిలుకూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కోదాడరూరల్ : త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పర్వదినం నిలుస్తోందని కోదాడ పెద్ద మసీదు ఇమామ్ మౌలానాఅబ్దుల్ రషాది అన్నారు. శనివారం బక్రీద్ పర్వదినం సందర్భంగా కోదాడ పట్టణంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బక్రీద్ పండుగ ప్రవక్తఇబ్రహీం భక్తి భావాన్ని, విశ్వాసాన్ని, త్యాగాన్ని సమాజానికి ప్రబోధిస్తుందన్నారు. ప్రతి ముస్లిం తనకున్నంతలో కొంత పేద ప్రజలకు దానం చేయాలన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు పలు పార్టీల నాయకులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పలు పార్టీల నాయకులు ఉన్నారు.

గుడిబండలో..

మండలంలోని గుడిబండలో బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్దలను తలుచుకుంటూ వారి సమాదులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలో బక్రీద్ వేడుకలను ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ముస్లిం మత పెద్ద ఎండీ గౌసుద్దీన్, ముస్లిం మైనార్టీ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

మఠంపల్లి : మఠంపల్లి మండల కేంద్రంతో పాటు రఘునాథపాలెం, పెదవీడు, చౌటపల్లి, యాతవాకిళ్ల తదితర గ్రామాల్లో ముస్లింలు శనివారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ముస్లిం పెద్దలు హఫీజ్‌ఖాన్, జమీల్, నిజామ్, జహంగీర్, జమీర్, రంజాన్, కుతుబ్, రహీమ్, జానీపాషా, అబ్బాస్‌అలీ, కరీమ్, నాగుల్‌మీరా, పెద్ద హసన్‌సా, తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంని గ్రామాల్లో శనివారం బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరి, వేపలసింగారం తదితర గ్రామాల్లో శనివారం బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు కాగిత రామచంద్రాపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం తదితర గ్రామాల్లో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు తమ పూర్వీకుల సమాదుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చిలుకూరు : మండల వ్యాప్తంగా గల గ్రామాల్లో శనివారం ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిలుకూరు మండల కేంద్రంతో పాటు బేతవోలు, కొండాపురం, సీతారాంపురం, జెర్రిపోతులగూడెం గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మఠంపల్లి : రఘునాథపాలెంలో..



హుజూర్‌నగర్‌రూరల్ : లింగగిరిలో..



కోదాడరూరల్ : గుడిబండలో..



గరిడేపల్లి : పానుగోడులో..

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏపూరి రాజు

మునగాల : జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి కార్యకర్త సమాయత్తం కావాలని ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా గ్రామగ్రామాన దిమ్మెలు నిర్మించాలనే లక్ష్యంపై సోమవారం కోదాడలో జరిగే ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్‌పీ అనుబంధ సంఘాల నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెలరోజుల పాటు గ్రామాల నూతన కమిటీలు, ఎమ్మార్పీఎస్ గద్దెలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి ఆంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు, ఎంఎస్‌పీ మండల శాఖ అధ్యక్షుడు లంజేపల్లి శ్రీను మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పెద్ద శ్రీనుమాదిగ, ములుగూరి వెంకటేశ్వర్లు, తాళ్లపాక వీరబాబు, వినయ్‌కుమార్, రాంపంగు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల 2005 –06 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శనివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 20 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ చింతలపాటి వాణి, ఉపాధ్యాయులు అరుణ, కరుణాకర్‌రెడ్డి, రాంబాబు, సుధాకర్, ఎస్ఎన్.మూర్తి, కాంపాటి కోటయ్య, పూర్వ విద్యార్థులు అలివేలు, అనూష, మమత, సంధ్య, హైమావతి, సుమలత పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సూర్యాపేట అర్బన్ : ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం 6వ రోజు సూర్యాపేట పట్టణంలోని 6వ వార్డు దాసాయిగూడెంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గృహ, వాణిజ్య, వ్యాపార సంస్థల వారు తమ ఇళ్లలోని తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. వీధులలో సంచరించు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పెంపుడు కుక్కల మెడకు బెల్ట్‌లు వేయాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా శిథిలావస్థలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న భవనాల వారికి నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, యాదగిరి, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వార్డ్ అధికారి ధరావత్ నవీన్, వసీం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల ఇండోర్ స్టేడియంలో డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. మే 1నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ నల్లగొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో టీషర్ట్స్, కోచింగ్‌కు మెటీరియల్ అందించినట్లు బ్యాడ్మింటన్ జిల్లా కోచ్ ఎం.రామకృష్ణ తెలిపారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు జిల్లా అసోసియేషన్, మిర్యాలగూడ అసోసియేషన్ నిర్వాహకులు బహుమతులు అందజేసి ఘనంగా సత్కరించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జి.అంజయ్య, డాక్టర్స్ అశోక్‌రెడ్డి, ప్రశాంత్, నవీన్‌కుమార్, విక్రాంత్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.